ఉద్యోగుల స్పందనకు 7అర్జీలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో 7 అర్జీలు వచ్చినట్లు డిఆర్వో రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు పలు సమస్యలపై అర్జీలను డిఆర్వోకు అందజేశారు. రెవెన్యూకు సంబంధించి 1, డిఎంహెచ్‌వో 1, డిసిహెచ్‌ఎస్ 1, విద్యాశాఖ (ఆర్‌జెడి)1, గిరిజన సంక్షేమశాఖ 1, గ్రామీణ నీటి సరఫరాశాఖ 1, రెస్కో (విద్యుత్) 1 చొప్పున అర్జీలను డిఆర్వో స్వీకరించారు. సమస్యలపై వెనువెంటనే పరి ష్కారం చూపేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో

నాణ్యమైన దిగుబడులు

☞ జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు: మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జెసి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పలమనేరు మండలం కొలమాసనపల్లిలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసుదన్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్, జిల్లా వ్యవసాయ అధికారి మురళికృష్ణ పాల్గొన్నారు. సమావేశంలో జెడ్పి చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన పంటగా రైతులు మామిడి సాగు చేస్తున్నారని, తక్కువ ఖర్చుతో నాణ్యత గల ఉత్పత్తులు పొందెలా అవగాహన మరింతగా కల్పించాలని, పశుసంవర్ధక శాఖ ద్వారా మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జెసి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, సలహా మండలి సభ్యుల సూచనల మేరకు సమావేశాలను వినూత్నంగా వ్యవసాయ క్షేత్రాలలో నిర్వహించడం జరుగుతున్నదన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొనేందుకు ప్రయోగాత్మకంగా పరిశీలన అవసరం అన్నారు. సలహా మండలి చైర్మన్ మాట్లాడుతూ నాణ్యత, ఎగుమతులు పెంచేందుకు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారి శాస్త్రవేత్తల సహకారంతో పూత దశ నుంచి కాయలు ఏర్పడే వరకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రత్నారెడ్డి, శివ ప్రకాష్‌రాజు, జెడ్పి సీఈవో ప్రభాకర్‌రెడ్డి, అధికారులు రమణారెడ్డి, మోహన్‌బాబు, గంగాభవాని, శాస్త్రవేత్త రెడ్డిరాము తదితరులు పాల్గొన్నారు.

నగరంపై మమకారం.. పచ్చదనానికి శ్రీకారం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నిన్నటి వరకు అక్కడ అంతా వ్యర్థాలతో దుర్వాసన.. పేరుకుపోయిన చెత్త కుప్పలు దర్శనమిచ్చేవి. పారిశుద్ధ్యంపై కమిషనర్ అరుణ తీసుకున్న చొరవతో ప్రస్తుతం అక్కడ ప్రదేశమంతా పరిశుభ్రంగా దర్శనమిస్తోంది. పచ్చని మొక్కలు కలకలలాడుతున్నాయి. నగరంలోని 34వ వార్డులో ఆర్టీసీ డిపో రోడ్డులో వ్యర్థాలతో నిండిన ప్రాంతాన్ని నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు శుభ్రం చేయించారు. శుభ్రం చేసిన ప్రాంతంలో శుక్రవారం నగర కమిషనర్ డాక్టర్ అరుణ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధుల్లో, నివాసాల మధ్య ఇష్టారాజ్యంగా వ్యర్థాలు పడేయరాదని, వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందివ్వాలన్నారు. నగరపాలక పరిధిలోని అన్ని వార్డుల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. స్థానిక ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. నివాసాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటిన ప్రాంతంలో వ్యర్థాలు పడేయరాదని బోర్డులను ఏర్పాటు చేయాలని, రోజూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

సైన్స్ ఫేర్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రీజినల్ సైన్స్ సెంటర్, తిరుపతి బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సైన్స్‌ఫేర్‌ను టిటిడి డిప్యూటీ ఈఈ దేవేందర్ బాబు శుక్రవారం ప్రారంభించారు. స్థానిక సైన్స్ రీజినల్ సెంటర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సజనాత్మకను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చాలా అవసరం అన్నారు. పిల్లల్లో సైన్స్ పరంగా మరింత నైపుణ్యతను తీసుకొచ్చేందుకు కషి చేయాలని సూచించారు. తిరుపతి బాలోత్సవం కార్యదర్శి మల్లారపు నాగర్జున మాట్లాడుతూ తిరుపతి బాలోత్సవాన్ని రెండు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశామన్నారు. అప్పట్నుంచి అనేక ప్రభుత్వ ప్రైవేట్ తిరుపతి మున్సిపల్ స్కూళ్లలో విద్యార్థులకు అతి దగ్గర బంధువయామని గుర్తు చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు చదువుల్లో తీవ్ర ఒత్తిడి ఉందన్నారు. మానస వికాసం తగ్గుతుందని తెలిపారు. వాటి నుంచి పిల్లల్ని బయటపడేసేందుకు ఆటపాట మాట తదితర కార్యక్రమాల ద్వారా మానసిక ఉల్లాసాన్ని కలిగించాలన్నదే బాలోత్సవం లక్ష్యం అన్నారు. ఇందుకు కషి చేస్తున్న తమకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ సైన్ సెంటర్ నిర్వాహకులకు కతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్లో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో పెద్ద ఎత్తున బాలోత్సవం నిర్వహిస్తున్నామని, ఇందులో విద్యార్థులు బాలలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బాలోత్సవం అధ్యక్షులు టెంకాయల దామోదరం మాట్లాడుతూ పాఠ్యాంశాల్లో ఉన్న విజ్ఞానాన్ని జీవితానికి అన్వయించుకుని, ప్రతి ఒక్కరూ విజ్ఞానవంతులుగా ఎదిగేందుకు కషి చేయాలన్నారు. శాస్త్రీయతపై పిల్లలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువుల పై ఉందని, మూఢనమ్మకాలను పారదోలాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలు తయారు చేసిన పలు అంశాలను ప్రదర్శన ఉంచారు. అనంతరం పిల్లలచే సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సైన్స్ ఫేర్ 17, 18 తేదీల్లో రెండు రోజులు పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నెహ్రు, పలు పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలకేంద్ర భవన

నిర్మాణాలు వేగవంతం చేయండి

- సంబంధిత అధికారులకు జెసి ఆదేశం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఏఎంసి, బిఎంసి భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జెసి క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. ఆరు మండలాల్లో 103 పాల కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించిన మేరకు పెడింగ్‌లో ఉన్న భవన నిర్మాణ పనులు త్వరితన పూర్తి చేయాలని సూచించారు. ఆరు బిఎంసిలను పూర్తి చేసి అప్పగించాలన్నారు. డిసెంబర్‌లో ప్రారంభించాలనుకున్న మరో 165 పాల కేంద్రాలకు సంబంధించి పనులు త్వరతన చేపట్టాలని, ఆ దిశగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డైరీ డెవెలప్మెంట్ అధికారి రవిచంద్రన్, డిసివో బ్రహ్మానందరెడ్డి, ఎస్‌ఈపిఆర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ పిఆర్ చంద్రశేఖర్‌రెడ్డి, డిడి సోషల్ వెల్ఫేర్ రాజ్యలక్ష్మి, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ బాషా, డిఎల్‌డివో రవికుమార్, అమూల్ డైరీ ప్రతినిధి నవీన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పోరాడుదాం

- టిడిపి, జనసేన నేతల పిలుపు
- నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో వేర్వేరు సమావేశాలు

ప్రజాశక్తి-నగరి:

ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పోరాడదామని టిడిపి నగరి నియోజకవర్గ ఇంఛార్జ్ గాలి భానుప్రకాష్ ఆ పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరి పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన నాయకులు ఆత్మీయ సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జనసేన పార్టీ నగరి ఇన్చార్జి మహేష్, నాయకులు పాల్గొన్నరు. ఈ సందర్భంగా గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ ఏ తప్పు చేయని చంద్రబాబును 52 రోజులు రిమాండ్‌లో ఉంచారని, ఇది కేవలం రాజకీయ కక్షతోనే జరిగిందని తెలిపారు.

టీడీపీ, జనసేనల కలయికతో ప్రజలు హర్షిస్తున్నారని, ఆశీర్వదిస్తారని తెలిపారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు కరువయ్యాయని, పరిశ్రమలు రావడం లేదని, పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిపోతున్నాయని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పుత్తూరులో జగన్ రెడ్డి ఎన్నికల సమావేశం అప్పుడు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, మరమగ్గ కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పారని, అలాగే మద్య నిషేదం చేస్తామని చెప్పి,నేడు ప్రభుత్వాన్ని మద్యం పై వచ్చే ఆదాయంతో నడిపిస్తున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు మాధవయ్య, బాలాజీ, ధనంజేయనాయుడు, లక్ష్మి ప్రసన్న, రమేష్ బాబు, శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం:

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపేలక్ష్యంగా పనిచేయడానికి కార్యకర్తలు సిద్ధపడాలని టిడిపి, జనసేన నాయకులు అన్నారు. శుక్రవారం ఎస్ఆర్ పురం టిడిపి కార్యాలయంలో శుక్రవారం టిడిపి మండల అధ్యక్షుడు జయశంకర్‌నాయుడు అధ్యక్షతన ఉమ్మడి పార్టీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి టిడిని, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్‌లు డాక్టర్ థామస్, యుగంధర్ హాజరైయ్యారు. డిప్యూటి సిఎం నారాయణస్వామిపై తీవ్ర విమర్శలు చేశారు.

కులగణన పక్కాగా ఉండాలి

- కమిషనర్ అరుణ

సమావేశంలో మాట్లాడుతున్న కమిసనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కులగణన ప్రక్రియను నగరపాలక పరిధిలో పక్కాగా చేపట్టాలని కమిషనర్ అరుణ అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ, చిత్తూరు రూరల్, అర్బన్ మండలాల పరిధిలో కుల గణన-2023 నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లకు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్, డిప్యూటీ కలెక్టర్ శివయ్య మున్సిపల్, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జరిగే కులగణన కార్యక్రమాన్ని ఏలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చేయాలన్నారు. సర్వే నిర్వహణపై అవగాహన పెంచుకొని, వార్డు స్థాయిలో వాలంటీర్లకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ శివయ్య మాట్లాడుతూ కులగణన-2023 సర్వే నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లు పూర్తిస్థాయి అవగాహన చేసుకోవాలన్నారు. వార్డు స్థాయిలో ఈనెల 21-23వ తేదీల మధ్య వాలంటీర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. కుల గణన యాప్ లో నిర్దేశించిన మేరకు తప్పులు లేని వివరాలను నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయి సర్వే పై పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, తాహసిల్దార్ మురళీమోహన్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ఉమ్మడి బ్యాంకు ఖాతాలు తెరిపించండి

- కమిషనర్ డాక్టర్ అరుణ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జగనన్న విద్యాదీవెన లబ్దిదారుల కోసం సంబంధిత విద్యార్థి, తల్లి పేరిట ఉమ్మడి బ్యాంకు ఖాతాలు తెరిపించాలని కమిసనర్ డాక్టర్ అరుణ అధికారులకు సూచించారు. శుక్రవారం సాంఘీక సంక్షేమశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్న విద్యా దీవెన 4వ విడత ద్వారా సొమ్ము జమ కావాలంటే ఉమ్మడి ఖాతాలు ఉండాలన్నారు. అందుకు సంబంధించి మూడు రోజుల్లో ఉమ్మడి బ్యాంకు ఖాతాలు తెరిపించేలా విద్యార్థులు, వారి తల్లులను సమన్వయం చేసుకోవాలన్నారు. సిఓలు, ఆర్పీలు బ్యాంకు అధికారులతో చర్చించి ఖాతాలు తెరవడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రారంభించిన ఉమ్మడి ఖాతాల వివరాలను వార్డు సచివాలయంలో ఎడ్యుకేషన్ సెక్రటరీల ద్వారా నవశకం పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, మేనేజర్ ఉమామహేశ్వరెడ్డి పాల్గొన్నారు.

రేపు టి20 క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-సోమల: జిల్లా స్థాయి టి20 క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు టి20 క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్వైత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టి20 క్రికెట్ జట్టు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం ఎంపిక చేస్తామన్నారు. అండర్ 16, అండర్ 19, సీనియర్స్ విభాగంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని ఇతర వివరాలకు 7337362800, 8328210181 నెంబర్లకు సంప్రదించాలన్నారు.



ఘనంగా మంత్రి ఆర్‌కె రోజ

జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నగరి: మంత్రి ఆర్‌కె రోజా జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక, కర్షక వ్యతిరేక

ప్రభుత్వాలను గద్దె దించాల్సిందే

- ఏఐటియూసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.నాగసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

కార్మికులు, కర్షకుల నడ్డివిరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించేందుకు ప్రతి ఒక్కరూ నడుబిగించాలని ఏఐటియూసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.నాగసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం చిత్తూరు ఏఐటియూసి అనుబంధ సంగాల నగర కౌన్సిల్ సమావేశం దాసరి చంద్ర అధ్యక్షతన జరిగింది. సమావేశ ప్రాధాన్యత అజెండాను నగర కార్యదర్శి ఏ.సత్యమూర్తి వివరించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాల్సిందే అని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ఎండ కట్టారు. రైతులు కార్మికులు ఇబ్బందులకు గురి అవుతున్న పట్టించుకోకపోవడం దుర్మార్గం , దేశంలో ఉన్నటువంటి ప్రభుత్వరంగ సంస్థలను ఆదాని, అంబానీలకు కట్టబెట్టి దేశాన్ని, దేశ ప్రజలను దగా చేస్తున్నారని ధ్వజమెత్తారు. మోడీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అడిగే ధైర్యం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి లేదన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గం, రైతాంగం సమన్వయంగా ఐక్య పోరాటాలు చేస్తూ బిజెపి ప్రభుత్వాన్ని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు పోరాటం కొనసాగించాలని కార్మిక వర్గానికి రైతందానికి ప్రజా సంఘాలకు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఏర్పడిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయడానికి బిజెపి ప్రభుత్వం మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే సపోర్ట్ చేస్తూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును కార్మిక వర్గం ఎండగట్టాలన్నారు. నవంబర్ 27, 28 విజయవాడలో జరిగే కార్మిక రైతు మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి టి.కోదండ నాయకులు గోపీనాథ్, మణి, రమాదేవి, అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, గంజి రామ మూర్తి, సుబ్రహ్మణ్యం, ప్రభావతి, వెంకటేష్, రజిని కుమార్ , అరు ణ, జయ చంద్ర, నాగరాజ్ , జయశంకర్ , సురేష్ , వినాయక , దొరస్వామి, కష్ణ, శ్రీనివాసులు, మురుగేషన్ , కమల్ , జయలక్ష్మి, రమ,మణి మేగల, మోహన్ , బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకులకు కుర్చీ ఏర్పాటు

ఎంపిడివోకు వినతి పత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు

ప్రజాశక్తి-సోమల: ప్రభుత్వ ఆదేశాలతో ఉపాధిహామీ క్షేత్ర సహాయకులకు సచివాలయంలో కుర్చీ ఏర్పాటు చేసినట్లు ఎంపిడివో నాగరాజు తెలిపారు. సచివాలయంలో సీటు కల్పించాల్సిందిగా శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎంపిడివోకు వినతిపత్రం అందజేశారు. కాగా అప్పటికే సచివాలయాల్లో సీటు కేటాయించినట్లు ఎంపిడివో స్పష్టం చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

రాజయ్య మృతికి నివాళి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటకు చెందిన రాజయ్య ఆకస్మికంగా గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి నేత నూకతోటి రాజేష్ శుక్రవారం రాజయ్య మృతదేహానికి నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు రామయ్య, హనుమంతురెడ్డి, మునిరెడ్డి తదితరులు రాజేష్ వెంట ఉన్నారు.

పిహెచ్‌సి వైద్యునిగా ప్రవీణ్

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: స్థానిక పిహెచ్‌సి వైద్యులుగా డాక్టర్ ప్రవీణ్ నియమితులైయ్యారు. ఆ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఆయన చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తూ బదిలీపై గంగాధరనెల్లూరుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ షర్మిల తిరుపతి రుయాకు బదిలీపై వెళ్లారు.

టిడిపి ఇంటింట ప్రచారం

ప్రజాశక్తి-కార్వేటినగరం: బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంతో శుక్రవారం టిడిపి నాయకులు మండలంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. మిని మ్యానిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెంగల్‌రాయ యాదవ్, నాగేశ్వరరాజు, రమేష్, షేక్ సందాని, కిషోర్, హరి పాల్గొన్నారు.

ఎంపిడివో శ్రీదేవి సేవలు భేష్

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండల అభివృద్ధి ఎంపిడివో చేసిన సేవలు అభినందనీయం అని పలువురు కొనియాడారు. జిల్లా బిసి కార్పొరేషన్ ఈడీగా ఉద్యోగోన్నతిపై వేళుతున్న ఆమెను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ బాబురెడ్డి, ఎంపిపి అనిత, జెడ్పిటిసి లక్ష్మిప్రియ, తహశీల్దార్ ఇన్బనాదన్, ఇన్చార్జి ఎంపీడీవో సుధాకర్, నాయకులు హరిబాబు, ఏకాంబరం, మునిరాజు రెడ్డి, వెంకటరెడ్డి, సురేంద్ర రెడ్డి, ఎంఈఓ ఆంజనేయులుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి

ప్రజాశక్తి-కార్వేటినగరం: నాగుల చవితి పురస్కరించుకొని మండలంలోని నాగులమ్మ ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శుక్రవారం ఉదయం నుంచి మహిళలు పూజలు నిర్వహించారు. చిత్తూరు-పుత్తూరు రహదారిలోని ఆర్కేవీబీపేట సమీపంలో వెలసిన నాగాలమ్మకు అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

నగరి: పట్టణ పరిధిలో నాగులచవితి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. శివాలయాలు, నాగదేవత ఆలయాలు భక్తులతో కిక్కిరిసింది. ఓంశక్తి ఆలయం సమీపం గల నాగదేవత ఆలయంలో స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. దేశమ్మ దేవాలయంలోని నాగదేవత ప్రతిమకు అభిషేకం చేసి, పసుపు కుంకుమలు అద్ది కర్పూర హారతులు ఇచ్చారు. సాంప్రదాయం ప్రకారం నాగదేవత ప్రతిమల చుట్టూ రక్షాబంధనాలు చుట్టారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-రామకుప్పం: కుప్పం సాయిమాత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు జగదీష్ బాబు నేతృత్వంలో పలువురు పేదలకు నిత్యావరాలను శుక్రవారం పంపిణీ చేశారు. శారద పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి జన్మదినం, నాగుల పంచమి సందర్భంగా మండలంలోని రాజుపేట, పంద్యాలమాడుగు పంచాయతీ ల్లోని నిరుపెదలైన యానాది కుటుంబాలకు చెందిన పలువురికి చీరలు, పంచలు, నిత్యావసర వస్తువులను అందించారు. చేదోడుగా నిలిచి ఆదుకున్నందుకు పలువురు యానాదులు ట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీష్ బాబు కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని ఎంపీయుపి కాపు వీధి స్కూల్, జడ్పీ హైస్కూలు బాలికల పాఠశాల, మెయిన్ స్కూల్, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను గ్రంథాలయాధికారి కె మీనాకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలో ముగింపు రోజు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు భువదీశ్వరి, మెయిన్ స్కూల్ మురళీ కృష్ణ, మల్లిక, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

గుడుపల్లిలో

ప్రజాశక్తి-సోమల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు శుక్రవారం విద్యార్థులకు ఆటపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎల్లయ్య, గ్రంథాలయ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లి: మండలంలోని ఆదర్శపాఠశాల, జూనియర్ కళాశాలలో అధికారులు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయాల ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. అందులో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. మాదకద్రవ్యాలు వాడడం వల్ల కలిగి అనర్థాలపై అవగాహన కల్పించారు.

వెదురుకుప్పం: మండలంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ శారధ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకరరావు, ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ వెంకటేష్, గ్రంథాలయ అధికారి సతీష్‌కుమార్, పిడి భరణినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో బాలల దినోత్సవం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు కల బాల భవిత కేంద్రంలో బాలల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. బాలల ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన చర్యల గురించి తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలందరికీ ఆటల పోటీలు నిర్వహించారు. పిల్లలందరిని ఆటలతో, పాటల ద్వారా ఎల్లప్పుడూ ప్రోత్సహించాలని పిల్లలకు ఇష్టమైనవి తెలుసుకొని ఆ రంగంలో పిల్లలు ముందుకు వెళ్ళుటకు తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులకు ఆర్బిఎస్కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుదర్శన్ తెలియజేశారు. జిల్లా భవిత కేంద్రం నందు 50 నుండి 60 మంది పిల్లలు వివిధ రకాల లోపాలు వ్యాధులు కలిగిన పిల్లలు వస్తున్నారన్నారు. వారికి ప్రతిరోజు అవసరమైన పరీక్షలు జరిపి తగిన చికిత్సలు అవసరమైతే అందించడం జరుగుతున్నదన్నారు. పిల్లలందరూ సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి బాలల దినోత్సవ వారోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్ పి ఓ, ఆర్ బి ఎస్ కే, డాక్టర్ దుర్గాప్రసాద్ నాయుడు, స్వామి దాస్ డిఇ ఐసి మేనేజర్, డాక్టర్ వి శ్రీదేవి మెడికల్ ఆఫీసర్, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

రూ.40 కోట్లతో పంచాయతీల అభివృద్ధి

- తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: 40 కోట్ల రూపాయల నిధులతో 12 పంచాయతీలను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శివలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని తుడా పరిధిలోకి తీసుకొచ్చిన తర్వాత 40 కోట్ల రూపాయల నిధులతో 12 పంచాయతీలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. దేశంలోని ఎక్కడ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న ప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని తెలిపారు. నేడు ఎన్నో సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నియో జక వర్గ ప్రజలకు చేసిన సేవలను గుర్తించి ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారన్నారు. మండలంలో పార్టీలకు అతీతంగా ఇంత అభివృద్ధి జరుగుతున్నా ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో విమర్శించడం తగదని వైసీపీ నాయకులు చెంగల్ రెడ్డి అన్నారు. మండలంలో హౌసింగ్ పై అవకతవకలు ఉన్నాయని సర్పంచ్ రమేష్ అధికారుల దృష్టికి తీసు కొచ్చారు. ఎంపీపీ శివలక్ష్మి, జడ్పిటిసి కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి అధికారి ఆయా రంగాలలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అమరనాథ్, సర్పంచులు, ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థుల ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలని టిఎన్ఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఎస్వీయూలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, కార్యకర్తలు సమావేశం టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ కాలేజీలు పరీక్షలు నిర్వహించకుండా విద్యార్థుల్ని ఇబ్బందులకి గురిచేస్తున్నాయని విద్యా సంవత్సరం పూర్తిచేసుకున్నవారికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులకు ఇబ్బంది పెడుతున్నారని కొత్తగా విద్యార్థి, తల్లి జాయింట్ అక్కౌంటు మెలికతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఫీజులు, బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితా లతో చెలగాటం ఆడుతున్నారని దీనిపై వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు నాగేంద్ర బాబు, గణేష్,వంశీ,రఘు,బాలాజీ పాల్గొన్నారు.

సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షపై ఉచిత అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక వరదరాజనగర్ లోని విశ్వం టాలెంట్ స్కూల్ లో ఆదివారం ఉదయం 9 గంటలకు సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్‌లో 2024 విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత అవగహన సదస్సు నిర్వాహిస్తామని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టరు ఎన్ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు 4వ తరగతి నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థు లు, వారి తలిదండ్రులు పాల్గొని ఈ పోటీ పరీక్ష వివరాలు, వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షలో సీట్లు పొందడానికి మెలుకువలను, పద్ధతులను వివరిస్తారన్నారు. 9399976999, 8688888802 నెంబరులను సంప్రదించవచ్చునని తెలిపారు.

త్వరలోనే సప్లై ఛానెల్ పనులు ప్రారంభం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -కోట : త్వరలోనే సప్లై ఛానెల్ పనులను ప్రారంభిస్తామని ఎంఎల్‌సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. కోట మండలంలోని కేశవరం పంచాయతీలో రాఘవపురం నుండి చిల్లకూరు మండలంలోని తోణుకుమాల గ్రామాలకు వెళ్లే బి.టి రోడ్డు సప్లై ఛానల్ బ్రిడ్జి పనులు మధ్యలో ఆగిపోవడంతో గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియడంతో స్థానిక నాయకులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యులు బల్లి.కళ్యాణ్ చక్రవర్తి, గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సప్లై ఛానల్ బ్రిడ్జి పనులు ప్రారంభానికి చర్యలు తీసు కుంటామని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి,ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట మండలం నాయకులు గురుస్వామి,నరమాల రమణయ్య, కోట మాజీ జెడ్పీటీసీ ఉప్పల ప్రసాద్ గౌడ్, చిల్లకూరు మండల నాయకులు మారంరెడ్డి అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

సంస్కృత శాస్త్ర వ్యాఖ్యాన మాల రెండవ శాస్త్రార్థగోష్ఠి

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సంస్కృత శాస్త్రాలలో ఉండే శాస్త్ర జ్ఞానాన్ని ఆచార్యులకు, పరిశోధకులకు, విద్యార్థులకు తెలిపేందుకు దశాబ్దాల కాలంగా విశ్వవిద్యాలయంలో మహామహోపాధ్యాయ శ్రీపట్టాభిరామశాస్త్రి సంస్కృత శాస్త్ర వ్యాఖ్యాన మాల పేరుతో జరిగే శాస్త్రార్థసంగోష్ఠి రెండవ శాస్త్రచర్చా కార్యక్రమం విశ్వవిద్యాలయం ప్రముఖ రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో నిర్వహించారు. విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఆర్ క్రిష్ణమూర్తి అధ్యక్షతన సాహిత్య శాస్త్ర పండితులు ప్రొఫెసర్ కొంపెల్ల రామసూర్యనారాయణ శబ్దశక్తి విమర్శ అనే సాహిత్య శాస్త్ర అంశంపై చర్చించారు. విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ జియస్ఆర్ క్రిష్ణమూర్తి ఈ అంశంపై విశ్లేషించారు. ఈ కార్యక్రమానికి సంయోజ కులు ప్రొ.కె.గణపతిభట్, సహ సంయోజకులుగా డాక్టరు సోమనాథ్ దాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం సాహిత్య విభాగం ఆచార్యులు, విభిన్న విభాగాల అధ్యక్షులు, ఆచార్యులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు, ఇతరులు పాల్గొన్నారు.

12 ఏళ్లు నిండిన విద్యార్థులకు బ్యాంకు అకౌంటు

సహకార సంఘం బ్యాంకు చీఫ్ బ్రాంచ్ మేనేజర్

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : 12 ఏళ్ల నిండిన విద్యార్థులకు బ్యాంకు అకౌంటు ప్రారంభిస్తామని గూడూరు సహకార సంఘం బ్యాంకు చీఫ్ బ్రాంచ్ మేనేజర్ సత్యవతి పేర్కొన్నారు. మండలంలోని గొల్లపల్లిలో ఉన్న విందుటి సౌజన్య రెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు బ్యాంక్ అకౌంట్‌లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 12 ఏళ్లు నిండిన 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు అమ్మఒడికి ఉపయోగ పడుతుందన్నారు. ఇక డిగ్రీ చదువుతున్న విద్యార్థులు జాయింట్ అకౌంట్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొందన్నారు.

కటారి దంపతులకు నివాళి



బంగారుపాళ్యంలో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మాజీ మేయర్ కటారి అనురాధ, మోహన్ 8వర్ధంతి సందర్భంగా టిడిపి నాయకులు ఘన నివాళులు అర్పించారు. టిడిపి కార్యాలయంలో కటారి దంపతుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. వారు చిత్తూరు నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నాయకులు శ్రీనివాసులు, సురేంద్రకుమార్, కోదండయాదవ్, కటారి హేమలత, మోహన్, చెన్నకేశవనాయుడు, లావణ్య, సురేష్, ఆనంద్, ఈశ్వర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: చిత్తూరు మాజీ మేయర్ కటారి అనురాధ, మోహన్ 8వ వర్ధంతిని పురస్కరించుకొని మండల టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు ఘన నివాళులు అర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌గౌడ్, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు కోక ప్రకాష్‌నాయుడు, నాయకులు శాంతిమూర్తి, సూరి, రవి, రమేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలో జిల్లా తపాలాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. సంతపేట బృందావన్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థాయి బహుమతులు అందుకున్నారు. వేలూరు మార్గంలోని టిటిడి కళ్యాణ మండపంలో జిల్లా ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్‌ను తపాలాశాఖ నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మూడు రౌండ్‌లు నిర్వహించిన క్విజ్ పోటీల్లో బృందావనం పాఠశాల విద్యార్థులు తరుణశ్రీ, గురు యతిన్‌రెడ్డి, వినీల్, విగ్నేష్, హరి చరణ్ గెలుపొందినట్లు పాఠశాల కరస్పాండెంట్ శైలజకుమారి తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

త్రోబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-సోమల: పుంగనూరు జోనల్ క్రీడా పోటీలు కందూరు జెడ్పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా సీనియర్ బాయ్స్ విభాగంలో సోమల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు త్రో బాల్ పోటీల్లో మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయి జట్టుకు అర్హత సాధించారు. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

ఫ్లైఓవర్‌కి మరమ్మతులు

ప్రజాశక్తి -రేణిగుంట : రేణిగుంట పట్టణం ఫ్లైఓవర్ బ్రిడ్జికి యుద్ధ ప్రతిపాదికన మరమ్మతుల చేపట్టి రేణిగుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ నగేషం ఆదర్శంగా నిలిచారు. తిరుపతి నుండి రేణిగుంటకు వచ్చే మార్గంలో గంగమ్మ గుడి వద్దగల ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఉన్న రాడ్ విడిపోయి ప్రమాదకరంగా మారింది. తిరుమల వెంకన్న దర్శనం చేసుకుని వచ్చే భక్తులు ప్రతిరోజు తిరుపతి రేణిగుంటకి రాకపోకలు సాగించే ప్రజలు ఆ రాడ్ వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి ఆర్ అండ్ బీ అధికారులు దృష్టికి ప్రజలు పంచాయతీ అధికారులు ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. నిత్యం ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని గ్రహించిన సర్పంచ్ నగేషం తన పరిధి కాకపోయినా ఫ్లైఓవర్ బ్రిడ్జ్ కు మరమ్మతులు చేయించారు. ప్రమాదకరంగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పెద్ద రాడ్ ను అమర్చి యుద్ధ ప్రతిపాదికన మరమ్మతులు చేపట్టారు. సేవ చేయాలన్న సంకల్పం ఉంటే ఏ పరిధి అయినా సేవ చేసే శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకొని తన స్థాయిలో ప్రజలకు సేవ చేస్తూ ముందుకు సాగుతున్న సర్పంచ్ నగేషం అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జ్ వద్ద రాడ్ కు యుద్ధ ప్రతిపాదికన వెల్డింగ్ చేయించి ప్రజల రక్షణ ధ్యేయంగా నిలిచిన సర్పంచ్ కు రేణిగుంట గ్రామపంచాయతీ ప్రజలు శ్రీవారి భక్తులు, వాహనదారులు ప్రశంసలతో ముంచెత్తి అభినందించారు.

వెండోడు రైల్వేస్టేషన్‌లో రైళ్లు ఆపాలి

ప్రజాశక్తి - బాలాయపల్లి : మండలంలోని జయంపు గ్రామంలోని వెండోడు రైల్వేస్టేషన్ లో రైళ్లు నిలపాలని రైల్వే చీఫ్ పబ్లిక్ ట్రాఫిక్ మేనేజర్ యలెంద్రయాదవ్‌ని స్థానికులు శుక్రవారం కలిసి వినతపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 24 గ్రామాల ప్రజలకు అనుకూలమన్నారు. విద్యార్థులు, వివిధ పనులపై పట్టాణలకు వేళ్లేవారు, 2019లో వచ్చిన కరోనా కారణంగా వెందోడు స్టేషన్ లో రైళ్లు నిలపడం లేదని వాపోయారు. కృష్ణా, పూరీ , బిలాస పూర్ , తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని కోరారు. స్పందించిన రైల్వే చీఫ్ పబ్లిక్ ట్రాఫిక్ మేనేజర్ మాట్లాడుతూ వెండోడు రైల్వేస్టే షన్‌లో త్వరలో రైళ్లు ఆగుతాయని అధికారికంగా ప్రకటి స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బిజినెస్ ఆఫీసర్ సుబ్బారావు, పాముల రాంబాబు, బిజెపి జిల్లా అధ్యక్షులు సి. చంద్రప్ప, ఉపాధ్యక్షులు డి.ప్రసంతిరాజు ఉన్నారు.

విజయ్ కుమార్‌కు పితృవియోగం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు గెడిపూడి విజయ్ కుమార్ నాయుడు తండ్రి గెడిపూడి పరంధాములు నాయుడు శుక్రవారం కన్నుమూశారు. ఆయన భౌతిక కాయానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి నివాళులర్పించారు. విజయ్ కుమార్‌ను పరామర్శించి పార్టీ అండ ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: షార్ట్ సర్క్యూట్‌కు గురై ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిలోని పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్ర వాహనం అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్‌కి గురైంది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఆందోళన చెందిన స్థానికులు, పెట్రోల్ బంక్ సిబ్బంది వెనువెంటనే మంటలను అదుపు చేశారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.